# ఇట్లా జరిగిపోతే....

ఆరోజు పంతులు మా కయిదు లెక్క-లిచ్చాడు. అయిదింటికీ అయిదు మార్కు-లూ తెచ్చుకున్నాను....మర్నాడు మళ్ళీ మామూలే.

ఆరోజు మాఅమ్మా నాన్నా పోట్లాడుకోలేదు. మాఅమ్మ చెప్పిందల్లా మా నాన్న ఒప్పుకున్నాడు. ఆయన చెప్పిందల్లా ఆవిడా ఒప్పుకుంది. మాకొంప నెవరో మంత్రించినట్టయింది....తరవాత మళ్ళీ యథాప్రకారమే.

జీవితం ఈవిధంగా ఒక చిన్న వెలుగు వెలిగి వెంటనే ఎందుకు కొడ్తారిపోతుందో తెలిసేదికాదు.

ఇదంతా దేవుడిచేసే పరీక్ష అనుకునే వాణ్ణి....

★

ప్రెస్సుకు కొత్తటయిపు తెప్పించాం. అచ్చగా దాంతోనే కొంత మేటరు కంపోజు చేయించాం. ప్రూఫులు చూస్తుంటే మా ప్రింటింగూ బాగున్నట్టే తోచింది. ఎప్పుడూ మా ప్రింటింగు అట్లాగే ఉండకూడదూ ?....ఎప్పుడూ కొత్తటైపే వాడుతుంటే ఎందుకుండదూ ? అయితే మరి, ఈ కొత్తటైపు పూర్తిగా అరిగితేగాని ఇందులోనుంచి మళ్ళీ కొత్తటైపుకు డబ్బురాదాయె !

విషమసమస్యగా కనిపించింది....

★

వాళ్ల అల్లుడు ఆరునెల్లకోసారి పెళ్లాన్ని అత్తవారింట దిగవిడిచి తనకు అయిదొందలిస్తేగాని మళ్ళీ తీసుకుపోడు. వాళ్లట్లాగే ఇస్తున్నారు....కాని ఎంత కాలమిస్తారు ?

★

బాగా కలవాడు. అన్నదమ్ములులేరు. ఒకడేకొడుకు. ఒకటేకూతురు. హాయిగా కాలుమీద కాలేసుకుని కూర్చునే పరిస్థితి. మూడుతరాలు వెళ్లిపోతై. నందోరాజా భవిష్యతి....ఆయనకొడుకు నాతోపాటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ ఉద్యోగం పోతే వీధిలో నిలబడవలసిందే !.... ఏమిటీ కర్మ ?

★

"ఇటువంటి ఒడుదుడుకులు లేకుండా ఉండగలందులకే మన పూర్వీకులు వర్ణవ్యవస్థ తెచ్చిపెట్టారు. అందరికీ పనులు చూపించారు. తురకలూ, పాశ్చాత్యులూ రావటంతో అంతా పాడయిపోయింది. వాళ్లని బయటికి పంపించు, అంతా చక్క-బడుతుంది," అన్నాడొక హిందూ మహాసభ మనిషి.

నమ్మకం చిక్క-లేదు.

★

డైకాస్టింగు యంత్రంముందు నిలబడ్డాను. పూర్తిగా అరగంటసేపు ఏడిపించినమీదట యంత్రం సరిగా పని చెయ్యటం ప్రారంభించింది. అచ్చులు నున్నగా, నిగనిగలాడుతూ, సొట్టలూ, మట్టలూ లేకుండా రాసాగినై.

"ఆహా, ఈ విధంగా యంత్రం రోజల్లా పనిచెయ్యగూడదూ ?" అన్నాడు



'పోయి [illegible]లు వేసుకోరాదుటరా?'

'ఇవ్వాళ నాకు లెఖ్ఖల్లో ఫస్టు మార్కు వచ్చిందినాన్నా!'

---

పనిచేసేకుఱ్ఱాడు; అచ్చుల్ని ప్రేమతో చూసుకుంటూ.

నాకాప్రశ్నకు సమాధానం తెలిసింది!

"అసంభవం," అన్నాను.

"ఏం?" అన్నాడు.

"బాగా రాకుండాపోవటానికి కారణం ఇప్పుడు మంచి అచ్చులు రావటంలోనే ఉంది," అన్నాను.

వాడు నామాట నమ్మలేకపోయినాడు.

"చూడు. బాగా వస్తున్నంతసేపూ అచ్చులు గబగబా లాగేస్తావు. లాగిన కొద్దీ నీ తొట్టిలోఉన్నలోహం తగ్గిపోతుంది: అందుకని కొత్తలోహపుదిమ్మలు వేస్తావు. తొట్టి చల్లబడుతుంది. నీ అచ్చులు సరిగారావు. అదీకాక, నీ డై క్రమంగా వేడెక్కుతుంది. దాన్ని తగినంత చల్లబడేస్తేగాని అచ్చులు సరిగా రావు."

"తొట్టి ఎంతవేడిగా ఉండాలో, డై ఎంత చల్లగా ఉండాలో తెలిస్తే అచ్చులు బాగా వస్తాయేమో?" అన్నాడు మా వాడు.

"అంతేకాదు. తొట్టి ఏ వేగాన ఖాళీ అవుతుందో, డై ఏవేగాన వేడెక్కుతుందో తెలిసి, దానికి ఎప్పటికప్పుడు అవసరమైన చికిత్స చెయ్యగలిగితే తియ్యకుండా మంచి అచ్చులు వస్తా"యని చెప్పాను.

సంఘంలోమటుకు ఇంతేకాదా? ఒక వ్యక్తిగాని, వ్యక్తుల సముదాయంగాని శాశ్వతంగా సుఖంగా ఉండటానికి సులువుపద్ధతు లెక్కడున్నై?

ధనికుల సంతతి ధనికులుగానే ఉండగలందులకు వారసత్వం పెట్టారు. ఏమవుతున్నది? లక్షాధికారికి కాలక్రమాన లక్షమంది వారసులవుతున్నారు. దీన్ని కూడా తప్పించుకుందామని రాజరికాలకి ఒకడే వారసుణ్ణి పెట్టారు. ఈ సులువు మార్గం పనిచేసితీరాలి! పనిచేసిందా? ఆ సులువుమార్గం మూలంగానే రాజరికం సంఘానికి అనర్హంగా తయారయింది—వాళ్ల అల్లుడు వాళ్ళమ్మాయికి ఆనందం ఇవ్వటానికి అనర్హుడయినట్టుగానే.

మార్పుయొక్క తత్వాన్ని అర్థంచేసుకోకుండా, దానికి అనుగుణమైన మనుష్యప్రయత్నం చెయ్యకుండా, ఏదో ఓమంచిజాగా చూసుకుని, "అమ్మయ్య!" అని చతికిలబడి ఆమీదట శాశ్వతమైన ఆనందం పొందుదామని మానవుడు చేసే ప్రయత్నాలు ఫలించటానికి వీల్లేదు. పరిణామస్వరూపుడైన భగవంతుడామోదించడు. అటువంటిప్రయత్నాలు చేసే వాళ్లమీదికి సంఘాన్ని లేవదీస్తాడు.

—కుటుంబరావు.